ఇఫ్తార్ కోసం ముస్లిం రైల్వే ఉద్యోగులను త్వరగా పంపించాలి

అడ్డగుట్ట: పవిత్ర రంజాన్ మాసం నేపథ్యంలో రైల్వేలో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులను ఇఫ్తార్ కోసం కార్యాలయాల నుంచి త్వరగా పంపించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కోరారు.ఉపవాసం ముగించిన తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేసుకుంటారని ఏప్రిల్ 11వ తేదీ వరకు ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల లోపు ముస్లిం ఉద్యోగులను ఇళ్లకు పంపించడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సలహా జారీ చేసిందన్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు కూడా సంబంధిత అధికారులకు ఇదే విషయమై వినతిపత్రాలు కూడా సమర్పించారని, ఈ అంశంపై దృష్టి సారించాలన్నారు.

ఓయూ ఇన్‌స్పెక్టర్‌గా రాజేందర్



రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సైలు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నేనావత్ రాజేందర్ నియమితులయ్యారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఈయన సైబరాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఇన్‌స్పెక్టర్ బదిలీ ప్రక్రియలో భాగంగా మల్టీజోన్–2 మరికల్ నుంచి రాజేందర్ ఓయూ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆయన పీఎస్‌లో బాధ్యతలు చేపట్టగా ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మించారు.. విస్మరించారు!

- ప్రమాదాలకు నిలయంగా తార్నాక ఎఫ్ఓబీ ప్రాంతం
- ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు
- పని చేయాలని లిఫ్టులు
- నిరుపయోగంగా మారిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి



నిరుపయోగంగా మారిన ఎఫ్ఓబీ



పని చేయని లిఫ్ట్

లాలాపేట: తార్నాకలో ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నుంచి రెండు వైపులా ఉన్న యూ టర్న్‌ల ప్రాంతాలు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. తార్నాక చౌరస్తా నుంచి లాలాపేట ఫ్లై ఓవర్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌ను వ్యాపార సముదాయాల వారు ఆక్రమించడంతో పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక శాసన సభ్యులు, స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్, అధికారుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైందని తార్నాక వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఫిబ్రవరి 16న ప్రాంతంలో తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు బారికేడ్ల సందులోంచి ఓ వ్యక్తి రోడ్డు దాటుతూ ఆర్టీసి బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ప్రాంతంలో పాదచారులు రోడ్డు దాటడానికి ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు అంటున్నారు.

వరుస ప్రమాదాలు..

ఈ ప్రాంతంలో వరుస ప్రమాదాలు జరిగినా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని తార్నాక వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజా కిచెన్ ముందు గతంలో ఓ మహిళ రోడ్డు దాటుతూ ప్రైవేట్ బస్సు కిందపడి దుర్మణం చెందింది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారుల్లో స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద నిత్యం నెలకొన్న ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ఉన్న స్కూల్స్, కాలేజీ విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళ రోడ్డు దాటుతున్న క్రమంలో తలెత్తే సమస్యల పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దాదాపు రూ.6 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ముచ్చటగా మూడు రోజులు సైతం స్థానిక ప్రజలు, విద్యార్థులు బ్రిడ్జిని ఉపయోగించుకోలేకపోయారు. ఉన్న సమస్య పరిష్కారం మాట దేవుడెరుగు కానీ కొత్త సమస్యలు తలెత్తాయి.

దిష్టి బొమ్మల్లా లిఫ్టులు

బ్రిడ్జి ఏర్పాటు ప్రారంభం నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. అసలు ఆ ప్రాంతంలో ఇది ఏర్పాటు ఏ మేరకు ఉంది అనే విషయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండానే కమీషన్ల కోసమే ఏర్పాటు చేసినట్టు ఉంది. ఎందుకంటే దాదాపు ఈ బ్రిడ్జి ఏర్పాటుకు దాదాపు రెండున్నర సంవత్సరాల కాలం పట్టింది. బ్రిడ్జి పూర్తయి నెలల గడుస్తున్నా దానిని ప్రారంభించడానికి నేతల మధ్య ప్రోటోకాల్ పంచాయితీకి తెర లేపారు. తీరా స్థానిక శాసన సభ్యులు, డిప్యూటీ మేయర్ కలిసి బ్రిడ్జిని ప్రారంభించారు. కానీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన లిఫ్టులు ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. దీంతో రెండు వైపులా మెట్లు ఎక్కి దిగలేక రోడ్డుకు అడ్డంగా పెట్టిన బారికేడ్ల మధ్య నుంచి రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..

రూ. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ అందుబాటులోకి రాకపోవడంతో దానిని ప్రజలు, విద్యార్థులు ఉపయోగించుకోలేకపోతున్నారు. దీంతో అదికాస్త నిరుపయోగం, ప్రచార బ్యానర్లు వేసుకునేందుకు వాడుకుంటున్నారు.ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఉన్న లిఫ్టులను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికంగా ఉన పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేసినా ఫలితం లేదు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–కంతి విజయ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది

అ'పూర్వ' సమ్మేళనం



బంజారాహిల్స్: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ పూర్వ విదార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 1981–83 బ్యాచ్, ఫొటోగ్రఫీ డిప్లొమా విద్యార్థులు హైదరాబాద్ బోట్స్ క్లబ్‌లో కలుసుకున్నారు. 40 సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆనందకరమైన సమయంలో తమ కాలేజీ జీవితాన్ని, ఆ రోజుల మధుర స్మృతులను తలచుకుని, ఆనందభరితులు అయ్యారు. సమావేశానికి రాలేని దూరప్రాంతాల్లో ఉండేవాళ్లు ఫోన్ ద్వారా కలిశారు. ఫొటోగ్రఫీ డిప్లొమా చదివిన 30 మంది బ్యాచ్‌లోనిలో ఆరుగురు భౌతికంగా లేకపోడం దురదృష్టకరమని వారికి నివాళులర్పించారు. ఆత్మీయ సమావేశంలో జనార్ధన్, కాశీనాథ్, నరసింహారెడ్డి, వరప్రసాద్, ఇలియాస్, చాముండేశ్వరి, శ్రీమన్నారాయణ, సురేష్, శ్రీనివాస్, జి.వి.అమరేశ్వరరావు, పి.సుబ్రహ్మణ్యం, డేవిడ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు వినతి

అడ్డగుట్ట: సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో శుక్రవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైతే ప్రత్యేకంగా నిధులు మంజూరై మరింత అభివృద్ధి జరిగే అస్కారం ఉంటుందన్నారు. జిల్లా ఏర్పాటు అవశ్యకతను వివరిస్తూ త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో బాలరాజ్, ఉపాధ్యక్షులు శైలేందర్, కృష్ణ ముదిరాజ్, రవీందర్ సాగర్, జగదీష్, అశోక్ ఉన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థికి అభినందన



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడ ప్రాంతానికి చెందిన ఎన్‌సీసీ విద్యార్థి పీయూష్ పవార్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. ఎన్‌సీసీ తరఫున ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పీయూష్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదల, దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో ఎన్‌సీసీలో చేరి చక్కని ప్రతిభను కనబర్చిన పీయూష్ పవార్ భవిష్యత్‌లో మరింతా ప్రతిభ చాటాలన్నారు. భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనే పీయూష్ పవార్ కల నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశన్, లంకా రాజు, వెంకట్ ముదిరాజ్, శివకుమార్, గజ్జెల శ్రీనివాస్, సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులను ఆదుకోవాలి

కంటోన్మెంట్: రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో స్థలాలను కోల్పోయే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్తా డిమాండ్ చేశారు. కంటోన్మెంట్‌కు చెందిన పలువురు బాధితులతో కలిసి బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సతీష్ గుప్తా మాట్లాడుతూ.. రాజీవ్ రహదారి విస్తరణతో కార్ఖానా, వాసవీనగర్ పరిధిలోని విలువైన ప్రైవేటు స్థలాలు కనుమరుగు కానున్నాయని తెలిపారు. ఆయా భవనాల అద్దెలు, వ్యాపారాలపై ఆధారపడిన వందలాది మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తగిన పరిహారంతో పాటు ప్రత్యామ్నాయ సదుపాయాలు కల్పించాలన్నారు. గౌరి శంకర్, రాము, కృష్ణ, సాయిలేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

సీఏ పరీక్షకు 4.36 లక్షల మంది హాజరు

అమీర్‌పేట: మే నెలలో జరుగబోయే సీఏ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 4.36 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఈ విషయాన్ని ఐ.సి.ఎ.ఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ సీఏ రోహిత్ అగర్వాల్ స్వయంగా ఎక్స్‌లో పోస్టు చేశారన్నారు. సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ పరీక్షలకు హాజరవుతుండటం గడిచిన 75 ఏళ్లలో సీఏ చరిత్రలో ఇది మొట్ట మొదటిదని తన పోస్టులో పేర్కొన్నారని శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం క్యాంపస్‌లోని నాన్‌టీచింగ్ హోం ఫంక్షన్ హాలులో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర నిధులు రూ.9 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎన్జీవోఎస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, ప్రొ.సుధారాణి, ప్రొ.సుజాత, ప్రనీత, షర్మిల, హైమావతి, స్వాతి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏర్పుల నగేష్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు యోగి, శ్రీనివాస్, సందీప్, స్థానిక నాయకులు సునీల్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఓయూలో కాన్షీరామ్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కాన్షీరామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కాన్షీరామ్ చిత్రపటానికి బీఎస్ఎఫ్, బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్, ఓయూ విద్యార్థి జేఏసీ, ఎస్‌టీఎస్ఏ, భారత జాగృతి తదితర సంఘాల నేతలు నివాళులర్పించారు.

సీఎం అల్పాహారం పథకాన్ని కొనసాగించాలి



నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న పులి కల్పన

అడ్డగుట్ట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీఎం అల్పాహారం పథకాన్ని కొనసాగించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారి ఐఏఎస్ దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పులి కల్పన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎన్నికల ముందు అమలులోకి తీసుకొచ్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీఎం అల్పాహారం పథకాన్ని తిరిగి కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలు ఉదయం తిని రాకపోవడంతో పాఠశాలలో ప్రార్థన సమయాల్లో సొమ్మసిల్లి పడిపోతున్నారన్నారు. నగరంలోని మురికివాడల్లో నివాసముండే పిల్లల తల్లిదండ్రులు ఉదయాన్ని కూలీ, ఇతర పనులకు వెళ్తుండడంతో పిల్లలు ఇంట్లో తినకుండా పాఠశాలలకు వస్తున్నారన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం ప్రార్థన అనంతరం అందించాల్సిన రాగి జావా కూడా ఇంటర్‌వెల్ సమయంలో అందిస్తున్నారని తెలిపారు. పేద పిల్లల ఆకలి తీర్చే రాగి జావాను ప్రార్థన తర్వాత అందించాలని కోరారు.

వంజరి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



బుర్ర వెంకటేశంకు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: రాష్ట్రంలోని పలు బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం వంజరి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని శుక్రవారం సెక్రటేరియట్‌లో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలోని వంజరి సామాజిక వర్గం ప్రజలు సంచార జాతులుగా ఉంటూ చట్ట సభలకు దూరంగా ఉన్నామన్నారు. మా స్థితిగతులపై ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఇప్పుడైనా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్‌రెడ్డి తమ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వంజరి సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ పాల్గొన్నారు.

ఆగిపోయిన 'డబుల్' ఇళ్ల పనులు ప్రారంభించాలి

రసూల్‌పురా: రసూల్‌పురా నారాయణ జోపిడి సంఘం బస్తీలో ఆగిపోయిన డబుల్ బెడ్రూమ్ నిర్మాణ పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్, జీహెచ్ఎంసీ అధికారులను మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శుక్రవారం బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జీ టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు డబుల్ ఇళ్ల లబ్ధిదారులు మారేడుపల్లిలోని నివాసంలో తలసానిని కలిశారు. ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులు నిలిపివేశాడని ఎమ్మెల్యేకు వివరించగా హౌసింగ్ ఈఈ వెంకటదాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు ఫోన్ చేసి ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నజీర్, గౌస్, జరీనా, షకీరా, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తలసాని

ఆస్తి పన్ను వసూళ్లపై అవగాహన



ఆస్తి పన్నుకు సంబంధించి కరపత్రాలను అందజేస్తూ అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: ఆస్తి పన్ను నూరు శాతం వసూళ్లే లక్ష్యంగా బేగంపేట సర్కిల్ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ శ్రీవత్సా కోట ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మొండి బకాయిలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. మొండి బకాయిదారుల కోసం వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం అమలులో ఉన్నందున దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. శుక్రవారం బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య నేతృత్వంలో సిబ్బంది ఇంటింటికీ కరపత్రాలను పంచిపెట్టి అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. అలాగే షాపింగ్‌మాల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా ఆటోల ద్వారా ప్రకటనలు చేయించడం, చెత్తను తరలించే ఆటోల్లో ఆడియో ద్వారా అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.108 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.75 కోట్లను వసూలు చేశారు. మిగిలిన మొత్తాన్ని ఈ నెల 31 లోపు వసూళ్లు చేసేలా అధికారులు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వడ్డీపై 90 శాతం రాయితీ అందించే వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



ప్రాణాలు కాపాడిన రోగితో వైద్య బృందం

రాంగోపాల్‌పేట్: గుండె నుంచి శరీర భాగాలకు మంచి రక్తాన్ని తీసుకెళ్లే ఉదరభాగంలోని రక్తనాళమైన అయోర్టా వాపుతో పాటు శస్త్ర చికిత్స విఫలమైన ఓమన్‌కు చెందిన రోగికి కిమ్స్ వాస్కులర్, ఎండో వాస్కులర్ వైద్యులు అత్యవసర చికిత్సతో ప్రాణాలు కాపాడారు. కిమ్స్ వాస్కులర్, ఎండో వాస్కులర్ విభాగాధిపతి డాక్టర్ నరేంద్రనాథ్ మేడా వివరాల ప్రకారం.. ఓమన్‌కు చెందిన మూసా మహ్మద్ అనే వ్యక్తి అయోర్టా వాపుతో స్థానికంగా ఉండే ఆస్పత్రిలో శస్త్ర చికిత్స తీసుకోగా అది విఫలమై అక్కడ రక్తస్రావం మొదలైంది. ఆ దేశంలోని వివిధ ఆస్పత్రుల్లో తిరిగినా ఎక్కడ చికిత్స దొరకకపోవడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. అత్యవసర పరిస్థితిలో రోగి రావడంతో వెంటనే నరేంద్రనాథ్ మేడా బృందం ఆయోర్టా వాచిన చోట స్టంట్ వేయడంతో పాటు మూత్రపిండాల్లోనూ రెండు వైపులా స్టంట్ వేశారు. దీని వల్ల పాడైపోయిన అయోర్టా బాగు చేయడంతో పాటు రక్త సరఫరాను పునరుద్ధరించారు. మూత్రపిండాలకు వెళ్లే రక్తనాళాల్లో స్టంట్ వేయడంతో మూత్ర పిండాలు దెబ్బతినకుండా చేశారు. ఏ మాత్రం ఆలస్యం జరిగినా రక్తస్రావం జరుగుతుండటంతో ప్రాణాలకే ప్రమాదం వచ్చే అవకాశం ఉండేది. అత్యవసర వైద్యం అంటే సమయంతో పోరాడాలి, నిమిషాల మీద నిర్ణయాలు తీసుకోవాలి, వెనువెంటనే అత్యంత సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయాలని డాక్టర్ నరేంద్రనాథ్ మేడా తెలిపారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన ఇద్దరికి జైలు

రాంగోపాల్‌పేట్: ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరికి జైలు శిక్ష పడింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సింధీకాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి రాజు (26), నల్లగుట్టకు చెందిన కృష్ణ (24) ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. సమాచారం అందుకున్న రాంగోపాల్‌పేట్ పోలీసులు వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి శుక్రవారం సికింద్రాబాద్ 16వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ శారదదేవి ముందు హాజరు పరచగా వారికి 4 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కంటోన్మెంట్‌లో ఎన్నికల సందడి

దూకుడు పెంచిన ఆశావహులు



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సందడి మొదలైంది. పార్లమెంట్ ఎన్నికలతో పాటే అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబీకులు పోటీలో ఉండటంపై సందిగ్ధత నెలకొనడంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి సైతం పలువురు టికెట్ కోసం పోటీపడుతున్నారు. ఇక ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రజాక్షేత్రంలోకి కాంగ్రెస్, బీజేపీ

ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్. శ్రీగణేశ్, జీ.వీ. వెన్నెల సిద్ధమవుతున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో కలిసి శ్రీగణేశ్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇటీవల అమిత్‌షా సభ, ప్రధాన మంత్రి ర్యాలీని తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను కలుపుకుని ఈ సారి ఏలాగైనా తన గెలుపునకు కృషి చేయాలని అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల నియోజకవర్గ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజాక్షేత్రంలోకి వెళ్తున్నారు. కంటోన్మెంట్‌కు రూ.48 కోట్ల టీపీటీ బకాయిల విడుదల, ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం, అమ్ముగూడ రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వ నిధుల విడుదల, తిరుమలగిరి చెరువు సుందరీకరణ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర తదితర అంశాలను తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ అభివృద్ధి రెట్టింపు అవుతుందంటూ చెబుతూ వస్తున్నారు.

లాస్య కుటుంబం మౌనం..

లాస్య నందిత హఠాన్మరణంతో ఆమె కుటుంబ సభ్యులు షాక్‌లో ఉన్నారు. అంతిమ సంస్కారం అనంతరం క్యాడర్‌కు సైతం కలవడం లేదు. కొద్దిమంది ఆప్తులు మాత్రమే లాస్య కుటుంబంతో టచ్‌లో ఉన్నారు. ఉప ఎన్నికల్లో లాస్య నందిత కుటుంబ సభ్యుల పోటీ విషయంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేదు. దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య కుటుంబీకుల మౌనం నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి పార్టీ నుంచి ఇతర నేతలు సైతం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా మాజీ కార్పొరేషన్ల చైర్మన్‌లు గజ్జెల నాగేశ్, క్రిషాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా పార్టీ పెద్దలకు విన్నవిస్తున్నట్లు సమాచారం.

ఒవైసీని ఓడించి హైదరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరేస్తాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



పవర్‌బోర్‌ను ప్రారంభించిన అనంతరం నాయకులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ప్రారంభించిన కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఒవైసీని ఓడించి బీజేపీ జెండా ఎగురవేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో 17 సీట్లు గెలవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా సనత్‌నగర్ మైసమ్మ దేవాలయం వద్ద పవర్‌బోర్ వెల్ ప్రారంభించారు. అనంతరం అమీర్‌పేట డివిజన్ బాపునగర్‌లో ఆర్వో ప్లాంట్, ఎస్ఆర్‌నగర్ వాటర్ ట్యాంక్ పార్కు, అమీర్‌పేట దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్, శాంతిబాగ్ అపార్ట్‌మెంట్స్, బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మోండా డివిజన్ గ్యాస్‌మండీ స్పోర్ట్స్ గ్రౌండ్, బన్సీలాల్‌పేట న్యూబోయిగూడ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌లను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలు ధర్మ యుద్ధం లాంటివని, దేశం, ధర్మం కోసం బీజేపీకి ఓటేసి గెలిపించాలన్నారు.

400 సీట్లు గెలుపే లక్ష్యంగా..

ఎన్డీయే కూటమి 400 సీట్లు గెలవాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత నాలుగు సెక్టార్ల ద్వారా దేశంలో పని చేయబోతున్నామన్నారు. మహిళలు, యువకులు, రైతులు, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు, సరళ, సుచిత్ర, దీపిక, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నెమలి ఆనంద్, వెల్లాల రామ్మోహన్, కన్నూరి క్రాంతికుమార్, దయానంద్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం అవసరం..

బన్సీలాల్‌పేట్: ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సూచించారు. మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్ ప్లే గ్రౌండ్స్‌లో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికాతో కలిసి నూతన ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం దిశగా ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు రోజు వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఓపెన్ ఎయిర్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దయారామ్‌జీ, భీరం నర్సింగ్‌రావు, సందీప్, అశోక్, సర్వేష్, సత్యనారాయణ, విశాల్, సత్యం, రాజు, రాజేష్, పెద్ది అనిల్, భూలక్ష్మీ, ప్రియాంక పాల్గొన్నారు.

మోదీ పాలనకు బ్రహ్మరథం..

అడ్డగుట్ట: దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తుకారాంగేట్‌లోని సాయి నగర్‌లో పవర్ బోర్ వాటర్ ట్యాంక్, కొండారెడ్డి పార్కులో ఓపెన్ జిమ్‌లను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి బిజేపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పెద్దపీట వస్తుందన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా పవర్ బోర్ వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు మానసిక, శారీరకంగా దృఢంగా ఉండడానికి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీసీ సుభాష్‌రావు, జలమండలి డీజీఎం కృష్ణ, బిజేపీ నాయకులు బండ కార్తీకరెడ్డి, రవిప్రసాద్, రాజుగౌడ్, కన్నాభిరాం, నరేందర్, హంసరాజు, ఉదయ్ యాదవ్, మహేష్‌గౌడ్, శివాజీ, రాజేష్ పాల్గొన్నారు.